క్లుప్తంగా

పీఏసీఎస్‌లో ముగ్గురు సస్పెన్షన్?

బెజ్జూర్: బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆ శాఖలో పనిచేస్తున్న కార్యదర్శులు జక్కుల వెంకటేశ్వర్ గౌడ్, పర్శ సంజీవ్‌తో పాటు ఆపరేటర్ మహేశ్‌లపై శుక్రవారం సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా సహకార సంఘం అధికారి బిక్కు రాథోడ్ సంఘం కార్యాలయానికి సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

పీహెచ్‌సీని సందర్శించిన అదనపు కలెక్టర్


విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి సందర్శించారు. ఫుడ్ పాయిజన్‌తో గురువారం ఆస్పత్రిలో చేరిన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యాధికారి వినయ్ ఉప్రేను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ రియాజ్ అహ్మద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజా అజజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీసు యాక్ట్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా ఈ నెల 30 వరకు 30 పోలీసు యాక్ట్ (1861) అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలపై నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలని వినతి

కాగజ్‌నగర్‌రూరల్: తన భర్తను చితకబాదిన దహెగాం ఎస్సై రాజు, కానిస్టేబుల్ సర్దార్‌సింగ్‌లపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం దహెగాం మండలంలోని ఐనం గ్రామానికి చెందిన వెల్ములు సంగీత కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజంకు వినతిపత్రం సమర్పించారు. తన భర్త బాపురావు పశువులను కొట్టాడనే నెపంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ఇష్టం వచ్చినట్లు కొట్టారని పేర్కొన్నారు. వెంటనే పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాలేగూడ గ్రామంలో కళ బృందం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో సైబర్‌నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో మూఢనమ్మకాలు నమ్మవద్దని, ఏ సమస్య ఉన్నా పోలీస్‌స్టేషన్‌లో తెలుపాలన్నారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు రామ్‌చందర్, రోహిత్, వెంకటేశ్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధవిహార్‌లో దీప్‌దాన్ ఉత్సవ్

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో గురువారం దీపావళి సందర్భంగా ఘనంగా దీప్‌దాన్ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ విహార్ ప్రాంగణంలో బుద్ధుడి ప్రతిమ ఎదుట వందలాది దీపాలు వెలిగించారు. బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడు దుర్గం సునీల్, విలాస్, రాజేంద్ర ప్రసాద్, విజయ్ ఉప్రే, దుర్గం హంసరాజ్, కోయ్యాల మహేశ్, సందీప్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: గత జూలై, అక్టోబర్ నెలల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను శుక్రవారం సీఐ బుద్దె రవీందర్ బాధితులకు అందజేశారు. శ్రీకాంత్, చంద్రశేఖర్, మీర్జా ఎజాజ్‌బేగ్‌లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు గుర్తించి వారికి అప్పగించారు.

రెబ్బెనలో లక్ష్మీదేవి పూజలు చేస్తున్న మహిళలు



ఆసిఫాబాద్: ధనలక్ష్మీ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కెరమెరి: లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న కుటుంబం



ఘనంగా దీపావళి వేడుకలు

జిల్లాలో గురువారం దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మండలాల్లోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. పూలతోరణాలు, దీపాల వెలుగుల్లో ఇంటింటా వెలుగులు విరాజిల్లాయి. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు, నోములు జరుపుకున్నారు. వాడవాడల్లో ఇళ్లముందు దీపాలు వెలిగించారు. దుకాణాలు, ఇళ్లల్లో ధనలక్ష్మి, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు భారీగా టపాసులు పేల్చారు. కౌటాల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులు క్రాకర్స్ కాల్చి పండగ జరుపుకున్నారు. పలు గ్రామాల్లో గోమాతలకు రంగులు అలంకరించి రైతులు గోమాతకు పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


దహెగాంలో బాణసంచా కాలుస్తున్న చిన్నారులు


కౌటాలలో దీపం వెలిగిస్తున్న యువతి


కౌటాలలక్ష్మీపూజ చేస్తున్న కుటుంబసభ్యులు


కెరమెరి: కాకరవత్తులు కాల్చుతున్న చిన్నారులు


కౌటాల:గుండాయిపేట్‌లో గోమాతను పూజిస్తున్న రైతులు


కౌటాల: కేజీబీవీలో ఘనంగా దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థినులు


కెరమెరి: దీపాలు వెలిగిస్తున్న మహిళ

సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


రెబ్బెన: ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు


కెరమెరి: ఫారంలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి సంక్షేమ కుల గణన సర్వేను మండలంలో పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 3 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఇళ్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. తప్పనిసరిగా ఇంటిపై స్టిక్కర్లు వేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

కెరమెరి: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్వే సిబ్బందికి సామగ్రి అందించారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 61 మంది ఎన్యూమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు ఉన్నారని వారు తెలపారు.

జైనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న కుటుంబ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి జాదవ్ గుణవంత్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్యూమరేటర్లకు సర్వే కిట్లను పంపిణీ చేశారు. డీఎల్‌పీవో ఉమేర్ షరీఫ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, అధికారులు తదితరులు ఉన్నారు.

వైభవంగా దండారీ ఉత్సవాలు


కోలా ఆడుతున్న యువకులు


పోరీతో గుస్సాడీలు

కెరమెరి: గుస్సాడీ దండారీలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. ఆయా గ్రామాల్లో మరో రెండు రోజుల్లో గుస్సాడీ నృత్యాలు ముగియనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని చిన్న సాకడ గ్రామంలో శుక్రవారం చివరిగా ప్రత్యేకంగా మంగళహారుతులు ఇచ్చారు. ప్రతి ఇంటి నుంచి హారతులు సేకరించారు. మహిళలు, పురుషులు దండారీకి, గుస్సాడీలకు సంప్రదాయ భేటింగ్ చేపట్టారు. దంబిరావు, మోతిరాం, ఆనంద్‌రావు, జలపతిరావు, మానిక్‌రావు, జంగు, భీంరావు, అర్జున్, ఇ స్రూ, సోము, గాగ్రు, బల్లార్‌శావ్, విజయ్, బాదిరావు, నాగోరావు ఉన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

పెంచికల్‌పేట్: క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని గొంట్లపేట్ గ్రామంలో శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్ బహుమతులు ప్రధానోత్సవంలో పాల్గొని విజేతగా నిలిచిన ఇస్నవాయి జట్టుకు రూ.20వేలు, రన్నరప్ గొంట్లపేట్ జట్టుకు రూ.10 వేలు బహుమతిగా అందజేశారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. మాజీ సర్పంచ్ చంద్రమౌళి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ కన్వీనర్ శ్యాంరావ్, శ్రీనివాస్, మోహిన్, మనోహర్, నరేందర్, శేఖర్, తిరుపతి, మహేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

తెరుచుకున్న నందిగామ పాఠశాల


నందిగామ పాఠశాల వద్ద గ్రామస్తులతో అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని నందిగామ గ్రామంలో గత రెండు నెలలుగా మూతపడిన గిరిజన ప్రాథమిక పాఠశాల శుక్రవారం తెరుచుకుంది. గతంలో ఇక్కడ పనిచేసిన అనిల్‌కుమార్ బదిలీపై వెళ్లగా కొత్తగా ధర్మారావు ఇక్కడకు వచ్చారు. అయితే కొత్త ఉపాధ్యాయుడు విధుల్లో చేరకపోవడంతో రెండు నెలలుగా పాఠశాల తెరుచుకోలేదు. డీడీ ఆదేశాల మేరకు పాఠశాలలో సీఆర్టీ హనుమంతును నియమించినట్లు సోమిని కాంప్లెక్స్ హెచ్‌ఎం భిక్షమయ్య తెలిపారు. కొత్త ఉపాధ్యాయుడు వచ్చే వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేసినట్లు ఆయన తెలిపారు.

అకాల వర్షంతో నష్టం

దహెగాం/లింగాపూర్: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దహెగాం, లింగాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. మరో వారం రోజుల్లో కోతలు ముమ్మరం కానుండగా.. ఈ తరుణంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. వర్షాలకు పత్తి తడిసి నల్లగా మారితే గిట్టుబాటు ధర కోల్పోయే ప్రమాదం ఉంది.


దహెగాం శివారులో నేలకొరిగిన వరి

సంక్షిప్తం..

పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

కెరమెరి: వాంకిడి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో భోజనం వికటించి 30మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారని, ఇది ముమ్మాటికీ నిర్వాహకుల నిర్లక్ష్యమని వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు తుకారాం తదితరులు ఉన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలి

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం, వేతనాల పెంపు కోసం టీబీజీకేఎస్‌తో పాటు అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కృషి చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సూచించారు. టీబీజీకేఎస్ అనుబంధ కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన అంబాల ఓదెలు శుక్రవారం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడ మల్రాజు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు టీకానంద్ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, నాయకులు కోరంగ మాలశ్రీ, దుర్గం నిఖిల్, చాపిడి శ్రావణి, ఆత్మకూరి సతీశ్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 5వ తేదీన హైదరాబాద్ అప్పిగూడ సుప్రభాత్ హోటల్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లాలోని అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ముఖ్య కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మోతె లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణ, మాదిగలకు రావాల్సిన వాటాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

విద్యార్థుల హర్షం

ఆసిఫాబాద్‌రూరల్: హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్స్, డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో జ్యోతిబాపూలే బాలుర పాఠశాల విద్యార్థులు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ శ్వేత మాట్లాడుతూ వసతి గృహం విద్యార్థులకు డైట్, కాస్మొటిక్స్ చార్జీలు పెరగడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందుతుందన్నారు.

రూ.10 నాణేలతో నిరసన

కౌటాల: మండలంలోని తలోడి చౌరస్తాలోని ఎస్‌బీఐ బ్యాంకులో రూ.10 నాణేలు తీసుకోవడానికి బ్యాంకు సిబ్బంది నిరాకరించడంతో బాధితుడు బ్యాంకు ఎదుట రూ.10 నాణేలతో శుక్రవారం నిరసన తెలిపాడు. కౌటాల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బ్యాంక్‌లో పని చేసే రవీందర్ రూ.9 లక్షల నోట్ల నగదుతో పాటు రూ.4,900 విలువ చేసే రూ.10ల నాణేలను బ్యాంకులో డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. బ్యాంకు సిబ్బంది రూ. 9 లక్షల నోట్ల నగదు తీసుకుని డిపాజిట్ చేశారు. కానీ రూ.10 నాణేలు తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో బాధితుడు బ్యాంక్ మేనేజర్ విష్ణును సంప్రదించగా అంత పెద్ద మొత్తంలో నాణేలు తీసుకోస్తే లెక్కించడం కష్టమవుతుందని సమాధానం ఇచ్చాడు. దీంతో బ్యాంకు ఎదుట నిరసన తెలిపాడు.

15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024–25 సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చని పట్టణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. నవంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇంటర్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బోడపల్లి గ్రామానికి చెందిన ఎగ్గే మాధవ్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. కాగజ్‌నగర్ నుంచి బోడపల్లికి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో మాధవ్ తలకు తీవ్రగాయం కావడంతో రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన బంధువులు వాహనం అద్దాలు పగులగొట్టారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

కెరమెరి: మండలంలోని లేండిగూడ గ్రామానికి చెందిన తోగరే విశ్వనాథ్ (40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం వారసంతలో నిత్యావసర వస్తువుల కొనుగోలుకు వెళ్లిన విశ్వనాథ్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం ఎందుకు తాగావని కుటుంబసభ్యులు మందలించగా మనస్తాపానికి గురై ఇంట్లోనే గుర్తు తెలియని గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తమ్ముడు తోగరే లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.